# "మందమీద తోడేలు వడ్డట్టుంది"

**మొ**న్నోపారి ఊరిక పొయి రొంద్రోజులున్న. కన్నాగురం పొవుటానికి బస్టాండు కచ్చిన. బస్సికచ్చుటానికింకా సానసేపయ్యేతట్టుంది. ఎందుకంటె అదింకా మా ఊరి పక్కూరికే పోలే. అదటుపొయ్యి తిరిగిరావాలె. మల్ల ఇంటికి పొవుడెందుకని శెంకరయ్య హోటలు, గుడిసెలకు పెయిన. గుడిసెలున్న బెంచీలమీన నలుగురైదుగురు కూసోనున్నరు.

"ఎన్నడు రానోనివి ..స్టాండుకచ్చినవేమె? ఎవ్వలన్నచ్చేదుందా?" అన్నడు ఒగయినె. రొండో అయినె మొకంల రగుతం లేకుంటైంది. "నా కొడుకత్తడని సూత్తన్న. ఆడు ఊల్లెకెల్లిపొయ్యి పదిగేన్రోజులాయె. ఏడున్నడో ఏమొ? ఊల్లె కత్తెనేమొ తన్నులైతయని బయపడ్తండు. ఆడు సుట్టాలింటిగ్గాడ సరిగ్గ పొయ్యేటోడు గాదు. నోట్లె నాలిక[96] లేనోడు. ఏడుంటండో? ఏం దింటండో? ఇయ్యాల్లనన్న వత్తడని సూత్తన్న. ఎంత పరేషాన్నయితందో కొడుక్కు?" అన్నడు.

"గా పొల్లగానికేమైందని ఊరిడిసిపెయిండే! వట్టి ఎడ్డిపోరడు. ఇంతకు ఎందుకోసురం పెయినట్టు? ఎక్కడికి పెయినట్టు?" అన్న నేను.

"ఎక్కడికి పెయిండో నాకైతె తెల్వది. ఆడెడ్డి పోరడయితేంది? ఎవ్వడయితేంది? అంగిలాగు తొడుక్కున్న పడుసుపోరగాండ్ల నందర్ని మలేసి కొడుతంద్రు పోలీసులు. మూతిమీన మీసంకట్టు మొలుత్తున్నోల్లంత ఊరిడిసి ఎల్లిపెయింద్రు. గా పోలీసయినెను చంపినడెవ్వడో దొరకనయితె దొరుకడుగని వట్టి వట్టోల్లను పట్టి కొట్టికొట్టి సంపుతంద్రు. ఆమాయెకులు గూడ తన్నులు దినవల్సత్తంది. ఊళ్ళళ్ళ ఉండరాకుంటయిపెయింది గాదె" అన్నడయినె.

"ఎంతయిన గింత – ముంటాదె? గాసాలయినింటికి పొయ్యి నీ కొడుకులేడ్రా అని అడిగింద్రంట పోలీసోల్లు. గోదావరిఖన్లె బాయిపని జేత్తంద్రన్నడంటయినె. వాళ్ళనాడికి తోలి నువ్వున్నావుర అని వట్టిగనే నాలుగైదు దెబ్బలుతికి పెయింద్రట. ముసలోడు విలవిల కొట్టుకున్నడట'
'

"గా హరిజెనులిండ్లల్ల నయితె ఇంకింత గోరం జేసిరి. ఆల్ల ఇంటింటికి పొయ్యి కొట్టింద్రు. వాళ్ళతోనే వాళ్ళ గుడిసెలన్ని పీకేయించింద్రు. ఇండ్లు గూలగొట్టిచ్చింద్రు. పాపమిగాల్లెట్ల బతుకాలె?'
' ఇంకొగయినన్నడు.

"మనూల్లె గాల్లండ్ల కల్సినోల్లెవ్వలు లేకనే పెయిరి. అందరు మంచిగ కల్సిమెల్సున్నట్టే ఉండిరి. గిక్కడ గూడ గిట్లెందుకు జేత్తంద్రు".

"లేరు నిచ్చమే కని అల్లకందరి మీదనుమానమే. ఇగ గండ్ల గల్సినోల్లున్న ఊల్లల్లనయితె ఇకింత బెగ్గం పాడు జేసిండ్రట. చెట్నీల, జాడీలల్ల ఉచ్చలు పోసిండ్రట. బియ్యం, వడ్లు, తీసి నూతులల్ల పోపిచ్చిండ్రట. గందురగోలం జేసిండ్రట. కొంకులల్ల[97] రోకలిబండలిరికిచ్చి కొడితె కొంతమంది లేవకుంటయిండ్రట".

"గా అన్నలు గూడ గిట్ల జేసుడేం మంచిగుంది? పోలీసోల్లం జంపుతెట్ల? గట్ల జేసినంకాల్లకు కోపం రాదా?"

"వాళ్లు వీళ్ళం జంపిరి వీళ్ళు వాళ్ళం జంపిరి. ఎవ్వలనైన ఎవ్వలైన సంపుడు మంచిది గాదు. మందింజంపుతె వచ్చేదేంది? వాళ్ళీళ్ళు కొట్టుకసత్తంటె నడుమ పట్టి వట్టోలకు సావు రాపట్టె. సంపినోన్ని పట్టుకోవాలె గని జెనాలందర్ని ఉతుకుడు వెడితేమత్తదాల్లకు? నీ యవ్వ! గిదేమన్న రాజ్జెమోలున్నాదె? రజాకార్లప్పుడన్న నయమనిపిచ్చింది" అన్నడో ముసలైనె.

"గోడలకు సెవ్వులుంటయి. గీ మాట పోలీసోల్ల సెవుల్లపడితె టేషన్లేసి మెతుపుతరు.[98] వీపు విమానం మోత మొగిత్తరు".

"నిన్న మొన్ననయితె గిట్లేడ మాట్లాడకుందుంగని మొన్ననే ఊల్లెకెల్లి పోలీసులెల్లి పెయింద్రు. కట్టడిసేసిపెయింద్రు. ఊల్లెకు ఎవ్వలు కొత్తోల్లచ్చినా పట్టియ్యన్నన్రు. ఆల్లనెవ్వలన్న ఊళ్ళెకు రానిచ్చినట్టే తెల్సినా బువ్వగిట్ల పెట్టినట్టు తెల్సినా వాని పనిగ గోవిందే. గిట్ల కట్టడైంది. నిన్నట్నుంచి దెబ్బల్లేవు".

"గిట్లెన్ని రోజులుంటది? మల్లేదన్న పనాల్లు సెయ్యకుండరు. పోలీసోల్లు అందర్ని కలేసి తోమకుంటుండరు. వాళ్ళేమొ కొన్నూల్లల్ల పోలీసోల్లకు సెప్పుతార్ర అని పాట్టుపాట్టు సంపుతండ్రు. కాల్లు నరుకుతండ్రు. పోలీసోల్లేమొ ఆల్ల గురించి చెప్పుమని తన్నవట్రి. తెలువందేం చెప్పుడు? చెప్పితె ఆల్లూకుంటరా? ఎంతయిన ఊల్లల్ల బతుకుడు కట్టమే. వెనుకకు పోతె నుయ్యి, ముందుకువోతె గొయ్యోలుంది సంగతి......."

"ఇంక గిట్నయ్యం. గా జగిత్యాల దిక్కయితె గాల్లెవ్వలో హిందువుల పార్టోల్లున్ను, అన్నల పార్టోల్లు ఒగల్నొగలు కాల్సుకొని సంపుకుంటండ్రట. జెనాలర సేతుల్ల పానాలు వెట్టుకొనుంటన్నరు.

"అటాల్లు....ఇటీల్లు.....నడుమ పోలీసోల్లు. ఇగ బతుకుడెట్లనో సముజయితలేదు"

"మరి గా అన్నలచ్చినంక లాబాలయినయా?" అన్న

"పాలేర్ల జీతాలు పెరుగుడు, కయికిల్లు పెరుగుడు, దొరల జెబర్దస్తసోంటిది[99] తగ్గుడు.

గిసొంటియి కొన్ని మా అయినయి. కని గాల్లయిన, గీల్లయిన మంది జంపుడయితె మంచిగనిపిస్తలేదు. మరాల్ల కోసురం ఇంటింటికి తిరిగి అందర్ని కొట్టవట్టిరి పోలీసులు......ఊళ్ళుడవులైపోవట్టె".

"ఊల్లల్ల బతుకులిప్పుడు దినదిన గండం నూరేళ్ళాయుషు లెక్కనే ఉంది. మింగుమంటె కప్పకోపం......ఇడువుమంటె పాముకోపం......"

"మరి సోర పోరగాండ్లు సానమంది పోలీసోల్లు గింతెంబడి పడ్డగని గండ్లెందుకు సేరుతండ్రంటవు?" ఒగయినన్నడు.

"నౌకర్లు లేక కొందరు, బతుకుదెరువులేక కొందరు, ఊల్లల్ల దొరల పటాటోపం ఓర్సుకోలేక కొందరు, నిజంగనే సమాజం మార్చాల్నని కొందరు......దోపిడి అన్యాయాలు జరుగతంటె ఓర్వక కొందరు......ఏం తెలువకున్నా ఎందుకు పోతండ్రో గూడ తెలువక కొందరు......బీద సాదోల్లకు నిజంగనే సాయంజేద్దామన్న మంచి మనుసుతోని కొందరు గిట్ల తీరు తీరు కారణాలవల్ల పోతండ్రు. పెద్ద పెద్దగ భూములున్నోల్ల కొడుకులు గూడ గండ్లజేరి భూములు దక్కిచ్చుకోవచ్చని సూత్తండ్రంట. ఎవ్వలెట్ల సేరినా కని అంత గడబిడే ఉంది. మామూలు మనుషులకు గోసకచ్చింది. ఎనుకట్కెమొ రజాకార్ల పటాటోపం జూసినం......అటెనుక దొరల దొంతనం జూసినం......ఉన్నోల్ల జెబర్దస్తి అనుబవించినం......గిప్పుడు పోలీసోల్లది, గా అన్నల్ని సంపుత్తంది. గిప్పుడు ఊళ్ళ సంగతులంజూత్తుంటె మందమీద తోడేలు పడ్డట్టే ఉంది"

ఇంకా మాటలు నడుస్తనే ఉన్నయి. ఇంతల బస్సచ్చింది. ఆ బస్సుల ముసలయినె కొడుకు దిగిండు. కొడుకును బిగ్గీత అలుముకున్నడు ముసలయినె. 'ఏడేడ తిరిగత్తన్నవు బిడ్డా!' అని సెయ్యి వట్టుకొని ఇంటిమొకాన తీసుకపొయిండు. అరగంటల బస్సు తిరిగచ్చింది. కన్నాగురం పొయ్యేదాక నాకు గా హోటల్లన్న మాటలే మనుసుల మెదులుతున్నయి.

అయ్యబాంచెన్ అవ్వబాంచెన్, బాంచెన్[100] నీ కాల్మొక్త అనుకుంట బతికిన నా తెలంగాణ జెనం నైజామోని కెదురు తిరిగింద్రు......వీరోచితంగ పోరాడింద్రు.

మల్ల దొరల దోపిడికి తలవంచింద్రు. ఆ జెనమే మల్ల తుపాకిగుండ్ల కెదురు నిలిచి పోరాడుతండ్రు. గివ్వన్ని జూత్తంటె నా వీర తెలంగాణ తమ్ముల్లకు పోరాటం కొత్తేం గాదనిపిత్తది. భారతదేశంలనే మొట్టమొదట భూమి పోరాటం జేసిన నా తెలంగాణ జెనం, బతుకును దినదిన గండంగా గడుపుతున్నా దేశానికే మార్గం చూపుతరన్న నమ్మకం నాకుంది.

☆ ☆ ☆